## SONG -1

**పల్లవి:    అందాల తార అరుదెంచె నాకై - అంబర వీధిలో**
అవతారమూర్తి యేసయ్య కీర్తి -అవని చాటుచున్
ఆనందసంద్ర ముప్పొంగెనాలో - అమరకాంతిలో
ఆది దేవుని జూడ -
అశింపమనసు – పయనమైతిమి     **.. అందాల తార..**
1.  విశ్వాసయాత్ర - దూరమెంతైన - విందుగా దోచెను
వింతైన శాంతి - వర్షించెనాలో - విజయపథమున
విశ్వాలనేలెడి - దేవకుమారుని - వీక్షించు దీక్షలో
విరజిమ్మె బలము - ప్రవహించె ప్రేమ - విశ్రాంతి నొసగుచున్
**.. అందాల తార..**

2.  యెరూషలేము - రాజనగరిలో - ఏసును వెదకుచు
ఎరిగిన దారి - తొలగిన వేల - ఎదలో క్రంగితి
ఏసయ్యతార - ఎప్పటివోలె - ఎదురాయె త్రోవలో
ఎంతో యబ్బురపడుచు - విస్మయ మొందుచు ఏగితి స్వామి
కడకు   **.. అందాల తార..**

3.  ప్రభుజన్మస్థలము - పాకయేగాని పరలోక సౌధమే
బాలునిజూడ - జీవితమెంత - పావనమాయెను
ప్రభుపాదపూజ - దీవెనకాగా - ప్రసరించె పుణ్యము
బ్రతుకె మందిరమాయె - అర్పణలే సిరులాయె ఫలియించె
ప్రార్థన     **.. అందాల తార..**

## SONG -2

**నడిపించు నా నావా నడి సంద్రమున దేవా**
నవ జీవన మార్గమున నా జన్మ తరియింప     **||నడిపించు||**

నా జీవిత తీరమున నా అపజయ భారమున
నలిగిన నా హృదయమును నడిపించుము లోతునకు
నా యాత్మ విరబూయ నా దీక్ష ఫలియింప
నా నావలో కాలిడుము నా సేవ చేకొనుము     **||నడిపించు||**

రాత్రంతయు శ్రమపడినా రాలేదు ప్రభు జయము
రహదారులు వెదకిననూ రాదాయెను ప్రతిఫలము
రక్షించు నీ సిలువ రమణీయ లోతులలో
రతణాలను వెదకుటలో రాజిల్లు నా పడవ     **||నడిపించు||**

ఆత్మార్పణ చేయకయే ఆశించితి నీ చెలిమి
అహమును ప్రేమించుచునే అరసితి ప్రభు నీ కలిమి
ఆశ నిరాశాయే ఆవేదనెదురాయే
ఆధ్యాత్మిక లేమిగని అల్లాడే నావలలు     **||నడిపించు||**

ప్రభు మార్గము విడచితిని ప్రార్థించుట మానితిని
ప్రభు వాక్యము వదలితిని పరమార్థము మరచితిని
ప్రపంచ నటనలలో ప్రావీణ్యమును బొంది
ఫలహీనుడనై యిపుడు పాటింతు నీ మాట     **||నడిపించు||**

లోతైన జలములలో లోతున వినబడు స్వరమా
లోబడుటను నేర్పించి లోపంబులు సవరించి
లోనున్న ఈవులలో లోతైన నా బ్రతుకు
లోపించని అర్పనగా లోకేష చేయుమయా     **||నడిపించు||**

ప్రభు యేసుని శిష్యుడనై ప్రభు ప్రేమలో పాదుకొని
ప్రకటింతును లోకములో పరిశుద్ధుని ప్రేమ కథ
పరమాత్మ ప్రోక్షణతో పరిపూర్ణ సమర్పణతో
ప్రాణంబును ప్రభు కొరకు పానార్పణము చేతు   **||నడిపించు||**

## SONG -3

**ప్రభు ప్రేమ తొలికేక హృదయంలో ప్రతిధ్వనియించే**
పాపక్షమా యేసునిలో శరణు నొసంగుచు కనిపించే

1. పాపవికారము పొడసూప జీవితవిలువలు మరుగాయె
ఫలితముగా లోకములో బ్రతుకుటయే నాగతియాయె
పలువురిలో కనబడలేకా దాహముతో నేనొంటరిగా
బావికని పయనింప నాదుని దర్శనమెదురాయే
పావనుడు దాహముతో జలమును ఇమ్మని నను గోరె ||ప్ర||

2. జాతిని చూడని నేత్రముతో పాపము శోకని హృదయముతో
జాలిని చాటించుచునే తాకెను నామది వేదనతో
జాప్యము చేయక తెమ్మనియే దాచుకొనిన నాపాపమును
జడియచునే తెలిపితిని ప్రభు వెరిగిన నా నిజస్థితిని
జయమొందె నాతనువూ సరిగ నుడితవని ప్రభు తెలుపా

3. దేహమునే నాసర్వముగా భావించుచు మది పూజింపా
దినదినము జీవితమూ చావుగ మారిన కాలములో
దేవునిగా నా బంధువుగా మరణప్రవాహము ఛేధించి
దరిజేర్చి దీవించి నూతన జన్మ ప్రసాదించే
దయ్యాల కుహరమును స్తుతి మందిరముగ రూపించే ||ప్ర||

4. పాపము దాగును నాబావి లోతును చూచినదెవరు
పోరాటవాటికయౌ నా బ్రతుకును ఎరిగినవారెవరు
పాపికిని పాపమునకునూ భేదము చూపిన వారెవరూ
పాపిని కాపాడుటకు సిలువను మోసిన వారెవరూ
ప్రకటించె దైవకృప తెరచెను జీవన జలనిధులు ||ప్ర||

5. ఘటముతో వెడలితి నొంటరిగా పితరుల త్రానజనములకై
కనబడెను బావికడ రక్షణయూటల ప్రభుయేసు
కుండను వీడి పరుగిడితి బావిని చేకొని హృదయములో
ఘనమైన శుభవార్త ఆతృతతో ప్రజలకు తెలుసా
గ్రామప్రజా కనుగొనిరి విశ్వవిమోచకుడగు యేసున్ ||ప్ర||

## SONG -4

ప్రభు యెసుని వదనములో – నా దేవుడు కనిపించె(2)
పాపాత్ముల బ్రోచుటకై కృపలొలికిన కలువరిలో
పరలోకముకై చిరజీవముకై – ప్రార్థించెను నా హృదయం (2)

1.దిశ లన్నియు తిరిగితిని నా పాపపు దాహముతో(2)
దౌష్ట్యముతో మసలుచును- దౌర్జన్యము చేయుచును
ధన పీడనతో..మృగ వాంఛలతో- దిగజారితి చావునకు(2)

2. చెందాడితి బ్రతుకులను – దహియించితి గృహములను(2)
చెరగవు నా పాపములు – తరగవు నా వేదనలు
చనిపోయినను ధర వీడినను- చల్లారవు శోకములు(2)

3. పలు మారులు వినుచుంటి-నజరేయుని నీతి కధ(2)
పరిహాసము చేసితిని-పరమార్థమే మోసమని
పశు ప్రాయుడనై జీవించుటచే – ప్రాప్తించెను ఈ శిలువ(2)

4. కాలువరి ఆవరణములో-కరుణాత్ముని చేరువనే(2)
కనుమూసిన కాలములో- వెలుగుదఇంచిన వేళ
కనుగొంటిని నా దౌర్భాగ్యస్తితి-కనుపించెను నా బ్రతుకు(2)

5. యెసు నీ రాజ్యముతో- భువికేతెంచెడి రోజు(2)
ఈ పాపిని క్షమియించి-జ్ఞాపకముతో బ్రోవుమని
ఇల వేడితిని, విలపించుచును- ఈడేరెను నా వినతి(2)

6. పరదైసున ఈ దినమె- నా యానందములోను(2)
పాళ్గొందువు నీ వనుచు – వాగ్దానము చెయగనె
పరలోకమే నా తుది ఊపిరిగా – పయనించితి ప్రభు కడకు(2)

## SONG -5

దేవా! వెంబడించితి నీ నామమున్ జీవితేశ్వర నా జీవితాశ నీవే
రావె నా భాగ్యమా యేసువా ||దేవా||

యేసూ! నీదు ప్రేమను నే వింటిని భాసురంబగు నీ సిలువ నే గంటిని
యేసువాడను నే నంటిని ||దేవా||

ప్రభో! ప్రారంభించితి ప్రయాణమున్ పరలోక యెరూషలేము
పురికిన్ పావనా జూపుము మార్గము ||దేవా||

నాధా! ఈదలేను ఈ ప్రవాహమున్ నీదరిన్ గాన నీ కెరటాలధాటిచే
నావికా రమ్ము నన్ బ్రోవుము ||దేవా||

స్వామి! నీదు ప్రేమకు నే సాక్షిని సంఘమందున నా పొరుగువారికి నీ
సత్య సువార్త నే జాటుదున్ ||దేవా||

రాజా! నీదు రాజ్యములో జేరితి రమ్యమౌ రాజ్యమందున నన్ వాడుము
రక్షణానందము గూర్చుము ||దేవా||

## SONG -6

రండి సువార్త సునాదముతో -- రంజిలు సిలువ నినాదముతో
తంబుర సితార నాదముతో -- ప్రభు యేసు దయానిధి
సన్నిధికి **(2)**     **||రండి||**

యేసే మానవ జాతి వికాసం -- యేసే మానవ నీతి విలాసం
యేసే పతీత పావన నామం -- భాసుర క్రైస్తవ శుభ నామం **||రండి||**

యేసే దేవుని ప్రేమ స్వరూపం -- యేసే సర్వేశ్వర ప్రతిరూపం
యేసే ప్రజాపతి పరమేశం -- ఆశ్రిత జనముల సుఖవాసం **||రండి||**

యేసే సిలువను మోసిన దైవం -- యేసే ఆత్మల శాశ్వత జీవం
యేసే క్షమాపణ అధికారం -- దాసుల ప్రార్ధన సహకారం **||రండి||**

యేసే సంఘములో మన కాంతి -- యేసే హృదయములో ఘన శాంతి
యేసే కుటుంబ జీవన జ్యోతి -- పసిపాపల దీవెన మూర్తి **||రండి||**

యేసే జీవన ముక్తికి మార్గం -- యేసే భక్తుల భూతల స్వర్గం
యేసే ప్రపంచ శాంతికి సూత్రం -- వాసిగ నమ్మిన జన
స్తోత్రం **||రండి||**

## SONG -7

దేవుని నీతి ప్రతాపం --- భువి యేసుని సిల్వ ప్రభావం
దేవుల దేవుని అపురూపం --భువి యేసుని నామ స్వరూపం
దేవ యెహోవ సువాక్యం సౌభాగ్యం -- దైవ జనుల హృదయానందం.

||యేసుక్రీస్తు దైవ సుతుండు --- యేసుక్రీస్తు మనుజసుతుండు
యేసుక్రీస్తు దేవుండు --- యేసే ప్రభువు స్తుతిపాత్రుడు||

ఆద్యంత రహిత కీర్తి --- అవతార శ్రమార్జన మూర్తి
ఆకస రాసుల ఆదిపతి -- అవనీ సృజనాత్మ ప్రతీతి
అఖిల ప్రపంచ ప్రదాత – అధినేత -- అనుదిన కృపాలిడు సుఖదాత.

పాపము భయపడు నామం --- పాపాత్ముడు కృపగను హెూమం
పతితుల వెదకిన ప్రేమస్వరం --- పరలోక సుఖాల విహారం
పాప క్షమాపణ గానం – బహుమానం --- అనవరతము నిజబలిదానం.

జనముల జీవాధిపతి -- జగమంతటి నేలెడిజ్యోతి
జీవుల అంతిమ న్యాయపతి -- జీవాత్ములు క్రోలెడి నీతి
జనన మరణ జయశీల – నరపాల -- జగతిని మార్చెడి శుభజ్వాల.

## SONG -8

దేవుని వారసులం – ప్రేమ నివాసులము
జీవన యాత్రికులం – యేసుని దాసులము
నవ యుగ సైనికులం – పరలోక పౌరులము
హల్లెలూయ – నవ యుగ సైనికులం – పరలోక పౌరులము **||దేవుని||**

సజీవ సిలువ ప్రభు – సమాధి గెలుచుటకే
విజేత ప్రేమికులం – విధేయ బోధకులం
నిజముగ రక్షణ ప్రబలుటకై
ధ్వజముగ సిలువను నిలుపుదుము **(2)** **||దేవుని||**
ప్రభువును చూచుటకై ప్రజలందరు రాగా
విభు మహిమను గాంచ – విశ్వమే మేము గోల
శుభములు గూర్చుచు మాలోన
శోభిల్లు యేసుని చూపుదుము **(2)** **||దేవుని||**

దారుణ హింస లలో – దేవుని దూతలుగా
ఆరని జ్వాలలలో – ఆగని జయములతో
మారని ప్రేమ సమర్పణతో
సర్వత్ర యేసుని కీర్తింతుము **(2)** **||దేవుని||**

పరిశుద్ధాత్మునికై – ప్రార్ధన సలుపుదము
పరమాత్ముని రాక – బలము ప్రసాదింప
ధరణిలో ప్రభువును జూపుటకై
సర్వాంగ హెూమము జేయుదము **(2)** **||దేవుని||**

అనుదిన కూటములు – అందరి గృహములలో
ఆనందముతోను – ఆరాధనలాయే
వీనుల విందగు పాటలతో
ధ్యానము చేయుచు మురియుదము **(2)** **||దేవుని||**

హత సాక్షుల కాలం – అవనిలో చెలరేగ
గతకాలపు సేవ – గొల్గొతా గిరి జేర
భీతులలో బహు రీతులలో
నూతన లోకము కాంక్షింతుము **(2)** **||దేవుని||**

## SONG -9

మార్గము చూపుము ఇంటికి – నా తండ్రి ఇంటికి
మాధుర్య ప్రేమా ప్రపంచమో – చూపించు కంటికి **(2)**

పాప మమతల చేత – పారిపోయిన నాకు ప్రాప్తించె క్షామము
పశ్చాత్తాప్పమునొంది – తండ్రి క్షమ కోరుచు పంపుము క్షేమము **(2)**
ప్రభు నీదు సిలువ – ముఖము చెల్లని నాకు పుట్టించె
ధైర్యము **(2)** **||మార్గము||**

ధనమే సర్వంబనుచు- సుఖమే స్వర్గంబనుచు తండ్రిని వీడితి
ధరణి భోగములెల్ల – బ్రతుకు ధ్వంసము జేయ దేహీ నిను చేరితి **(2)**
దేహీ అని నీ వైపు – చేతులెత్తిన నాకు దారిని జూపుము **(2)** **||మార్గము||**

దూర దేశములోన – బాగుందుననుకొనుచు తప్పితి మార్గము
తరలిపోయిరి నేను – నమ్మిన హితులెల్ల తరిమే దారిద్ర్యము **(2)**
దాక్షిణ్య మూర్తి నీ – దయ నాపై కురిపించి ధన్యుని
చేయుము **(2)** **||మార్గము||**

అమ్ముకొంటిని నేను – అధముడొకనికి నాడు ఆకలి బాధలో
అన్యాయమయిపోయే – పందులు సహ వెలివేయ అలవడెను వేదన **(2)**
అడుగంటె అవినీతి – మేల్కొనియె మానవత ఆశ్రయము
గూర్చుము **(2)** **||మార్గము||**

కొడుకునే కాదనుచు – గృహమే చెరసాలనుచు కోపించి వెళ్ళితి
కూలివానిగనైన – నీ యింట పని చేసి కనికరమే కోరుదు **(2)**
కాదనకు నా తండ్రి – దిక్కెవ్వరును లేరు క్షమియించి
బ్రోవుము **(2)** **||మార్గము||**

నా తండ్రి నను జూచి – పరుగిడిచూ ఏతెంచి నాపైబడి ఏడ్చెను
నవ జీవమును గూర్చి – ఇంటికి తోడ్కొని వెళ్లి నన్నూ దీవించెను **(2)**
నా జీవిత కథయంత – యేసు ప్రేమకు ధరలో సాక్ష్యమై
యుండును **(2)** **||మార్గము||**

## SONG -10

భాసిల్లెను సిలువలో పాపక్షమా -- యేసు ప్రభూ నీ దివ్య క్షమా

కలువరిలో నా పాపము పొంచి -- సిలువకు నిన్ను యాహుతి చేసి
కలుషహరా కరుణించితివి **(2)** **||భాసిల్లెను||**

దోషము చేసినది నేనెకదా -- మోసముతో బ్రతికిన నేనెకదా
మోసితివా నా శాపభారం **(2)** **||భాసిల్లెను||**

పాపము చేసి గడించితి మరణం -- శాపమెగా నేనార్జించినది
కాపరివై నను బ్రోచితివి **(2)** **||భాసిల్లెను||**

నీ మరణపు వేదన వృధా గాదు -- నా మది నీ వేదనలో మునిగెను
క్షేమము కలిగెను హృదయములో **(2)** **||భాసిల్లెను||**

ఎందులకో నాపై ఈ ప్రేమ -- అందదయ్యా స్వామీ నా మదికి
అందులకే భయమొందితిని **(2)** **||భాసిల్లెను||**

నమ్మిన వారిని కాదన వనియు -- నెమ్మది నొసగెడి నా ప్రభుడవని
నమ్మితి నీ పాదంబులను **(2)** **||భాసిల్లెను||**